



సమ్మిట్ జరిగే ప్రాంతంలో ఏర్పాట్లు



వేదిక ఏర్పాటులో నిమగ్నమైన కార్మికులు

చకచకా..!

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పనులు

మహేశ్వరం/ఇబ్రహీంపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ పనులు చకచకా సాగుతున్నాయి. రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో వివిధ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులతో పాటు జిల్లా, డివిజన్, మండల అధికారులు ఏర్పాట్లు చేయించడంలో నిమగ్నమయ్యారు. ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంక పర్యవేక్షణలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా పనులు వేగవంతంగా చేయిస్తున్నారు. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి ప్రతినిధుల బృందం తోపాటు పారిశ్రామికవేత్తలు రానున్నారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వయా తుక్కుగూడ మీదుగా రోడ్ల మరమ్మతులు, డివైడర్ల ఏర్పాటు, దారికి అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు తదతర పనులు జరుగుతున్నాయి. 8, 9వ తేదీల్లో వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండే నేపథ్యంలో సామాన్య ప్రజలు హైదరాబాద్ తోపాటు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు దారి మళ్లింపు చర్యలను

మిగతా 6వ పేజీలో...

రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్న అధికారులు

తుక్కుగూడ నుంచి మీర్యాన్‌పేట వరకు మారిన రూపురేఖలు



విద్యుద్దీపాల ధగధగలు..

సమ్మిట్‌కు భారీ బందోబస్తు

మూడంచెల భద్రత

వెయ్యికిపైగా సీసీ కెమెరాల ఏర్పాటు

డీజీపీ బి.శివధర్‌రెడ్డి

6



పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- ధాన్యం నుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉండొద్దు
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్/పరిగి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఎన్నికల విధి విధానాలపై చేపట్టాల్సిన అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అనుమానాలకు తావు ఇవ్వకుండా ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు మార్గదర్శకాలకనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి గుర్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ ఇచ్చే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఓటరు స్లిప్పును పరిశీలించాకే ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో ఉషశ్రీ పాల్గొన్నారు. అనంతరం దుద్యాల్ మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కిషన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నామినేషన్లలో తప్పుల్లేకుండా చూడాలి

పంచాతీయ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం పరిగి మండలం రంగంపల్లి క్లస్టర్‌లో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు జరుగకుండా చూడాలని సూచించారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో ఏమైనా తప్పులు ఉంటే సరిచేసుకునేవిధంగా అభ్యర్థులకు అధికారులు సహకరించాలని సూచించారు.



పల్లెల్లో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఇప్పటికే తొలి విడత బరిలో నిలిచిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు కేటాయించిన గుర్తులతో ప్రచారం హోరెత్తిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలపై గుర్తులతో పాటు అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి.. కానీ పంచాయతీ ఎన్నికల్లో మాత్రం అభ్యర్థుల పేర్లు, ఫొటోలు బ్యాలెట్ పత్రాలపై కనిపించవు. కేవలం గుర్తులు మాత్రమే ఉంటాయి. ఓటు వేయాలనుకున్న అభ్యర్థి గుర్తు ఏదనేది ఓటర్లు మరిచిపోతే అంతే సంగతి. ఒకరికి వేయాల్సిన ఓటు మరొకరికి పడుతుంది. ఫలితంగా అభ్యర్థుల జాతకాలు తలకిందులయ్యే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తు ఓటర్లకు గుర్తుండేలా ప్రచారం సాగిస్తున్నారు.



గుర్తుంటేనే గెలుపు!

ఇంటింటి ప్రచారంలో అభ్యర్థులు

- బ్యాలెట్‌పై కనిపించని పేర్లు, ఫొటోలు
- సర్పంచ్, వార్డు సభ్యుల బ్యాలెట్‌పై 'నోటా'
- దీంతో అభ్యర్థులకు తప్పని గుర్తుల గుబులు
- తొలివిడత అభ్యర్థులకు ఇప్పటికే గుర్తుల కేటాయింపు
- నమూనా బ్యాలెట్ పత్రాలతో ప్రచార జోరు
- సోషల్ మీడియాలోనూ విస్తృతంగా ప్రచారం



వికారాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల భవితవ్యం వారికి కేటాయించిన గుర్తులపైనే ఆధార పడి ఉంది. తమకు కేటాయించిన గుర్తులను ప్రజల మనస్సుల్లో ముద్రపడేలా ఎవరు ప్రచారం చేస్తారో వారికే విజయావకాశాలు అధికంగా ఉంటాయి. ప్రజలు సులువుగా గుర్తుంచుకునే గుర్తులు వచ్చిన అభ్యర్థులకు ఇతర అభ్యర్థుల కంటే విజయావకాశాలు ఎక్కువే. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఏవీ బ్యాలెట్ పత్రాలపై ఉండవు. ఒక్క గుర్తులు మాత్రమే ఉంటాయి. పార్టీలకు సంబంధం లేని స్వతంత్ర గుర్తులు మాత్రమే అభ్యర్థులకు కేటాయించారు. ఆయా పార్టీల మద్దతుతో ఈ ఎన్నికలు జరుగుతున్నా బరిలో ఉన్న అభ్యర్థులు మాత్రం పార్టీలకు సంబంధం లేని గుర్తులతోనే ఓటర్ల వద్దకు వెళ్లాల్సిందే.. రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తుల చొప్పున కేటాయించింది. ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులనే రిటర్నింగ్ అధికారులు అభ్యర్థులకు కేటాయించారు.

ఒకే పోలికతో తికమక

అభ్యర్థులకు తెలుగు అక్షర మాల ప్రకారం గుర్తులు కేటాయించారు. నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవాల అనంతరం వికారాబాద్ జిల్లాలో తొలి విడతలో తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో జరిగే ఎన్నికల్లో 223 పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికల బరిలో 683 మంది ఉండగా, 1,527 వార్డు సభ్యులకు 3,953 మంది పోటీ

మిగతా 7వ పేజీలో...

ఓటర్లకు తెలిసేలా ప్రచారం...

గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల గుబులు పట్టుకుంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. పలుగుర్తులు ఒకే పోలికతో ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు, వృద్ధులు ఆ గుర్తులను గుర్తుంచుకోవడం కష్టంగానే ఉంది. పంచాయతీ ఎన్నికల్లో పరిమిత ఓట్లు ఉండడంతో ప్రతీ ఓటు కీలకమే. తమకు వచ్చిన గుర్తులను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు అభ్యర్థులు కష్టాలు పడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గుర్తులపైనే అభ్యర్థుల విజయావకాశాలు ఆధారపడి ఉండడంతో ప్రతి ఒక్క ఓటరుకు తమ గుర్తు తెలిసేలా ప్రచారం చేస్తున్నారు.

సోషల్ మీడియాలోనూ ముమ్మరం

వ్యక్తిగత ప్రచారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రచారం చేస్తున్నారు. హంగు ఆర్భాటం లేకుండా తమ గ్రామానికి చెందిన ఓటర్లందరికీ తమ గుర్తు చేరేలా చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా ప్రాముఖ్యతను గుర్తించిన అభ్యర్థులు తమకే ఓటు వేసి గెలించాలని కోరుతూ ఓటర్లను అభ్యర్థిస్తూ పోస్టు చేస్తున్నారు. అభ్యర్థులు వ్యక్తిగతంగానూ ఓటర్లను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తమ గుర్తులను ముద్రించిన కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం, ప్రచార గడువు సమీపిస్తుండడంతో గ్రామాల్లో ప్రచార హోరు వేగం పుంజుకుంటోంది. ఓటర్ల మనస్సుల్లో గుర్తులు బలంగా నిలిచేలా అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఉద్యానవన పంటల పరిశీలన

వికారాబాద్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మండల పరిధిలోని అలంపల్లి, నారాయణపూర్, పులుమద్ది గ్రామాలలో శుక్రవారం ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆమె అలంపల్లిలో 12.5 ఎకరాలలో సాగు చేసిన ఆయిల్‌పామ్ పంటను సందర్శించారు. రైతు మేకల చంద్రశేఖర్ రెడ్డి పంట పొలాన్ని ఆమె సందర్శించి పంట సస్యరక్షణ చర్యలపై సలహాలు ఇచ్చారు. నారాయణపూర్‌లో పందిరి పద్ధతిలో సాగు చేస్తున్న పుసుప, క్యారెట్ పంటలను పరిశీలించి రైతు మోహన్‌రెడ్డితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ కూరగాయల నర్సరీని సందర్శించారు. అలాగే పులుమద్ది గ్రామంలో రైతు బందెల్లి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, బంతి పూల తోట, రైతు నర్సింహారెడ్డి సాగు చేస్తున్న చామగడ్డ పంట పంట పొలాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం.ఎ.సత్తార్, అధికారి యమునా, హెచ్‌ఈవో అంజనేయులు, ఈకో పామ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా

విమానయానం.. గందరగోళం

ఒక్కరోజే 155 ఇండిగో విమాన సర్వీసులు రద్దు

ప్రయాణికుల ఆందోళన

భారీగా పెరిగిన ఇతర ఎయిర్‌లైన్స్ ధరలు

7

తాండూరులో ఏకగ్రీవ సంబరం

చరిత్రలో మొదటిసారి 25 గ్రామాలు యునానిమస్



నూతన సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఒక్క 'యాలాల'లో 10 పంచాయతీలు

జిల్లాలోనే అతి పెద్ద పంచాయతీ కరన్‌కోట్ సైతం..

నూతన సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాండూరు చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా 25 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో పాటు ఎన్నికైన సర్పంచ్‌లంతా కాంగ్రెస్ మద్దతుదారులు కావడంతో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు అంబరాన్నంటాయి. ఒక్క యాలాల మండలంలోనే 10 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లాలోనే అతి పెద్ద గ్రామ పంచాయతీ కరన్‌కోట్ సర్పంచ్ ఏకగ్రీవం కావడం విశేషం. గతంలో కరన్‌కోట్ సర్పంచ్‌గా గాజుల రాచప్ప ఏకగ్రీవమయ్యారు. ప్రస్తుతం

మిగతా 8వ పేజీలో...

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌తో అనారోగ్య సమస్యలు

లోక్‌సభలో ఎంపీ ఈటల రాజేందర్



న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల 30కి.మీ పరిధిలో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలు ఆ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసన, కీటకాల వల్ల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం, లోక్‌సభలో జీరో అవర్‌లో ఎంపీ ఈటల మాట్లాడుతూ.. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలోని జవహర్‌నగర్‌లో 40 ఏళ్ల కిందట డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారని.. అప్పట్లో ఒకటి రెండు వాహనాలు వచ్చి చెత్త వేసేవన్నారు. కానీ ఇప్పుడు 10 వేల టన్నుల చెత్తను ఒకే చోట వేస్తున్నారని అన్నారు. ఒకే చోట ఇంత భారీ స్థాయిలో డంపింగ్ యార్డ్ ఉండొద్దని 1.5 కోట్ల జనాభా ఉన్న హైదరాబాద్‌లో నాలుగు మూలల డంపింగ్ యార్డ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు 2017 నుంచి చాలా సార్లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చిందని అయినా ఇప్పటివరకు పరిష్కారం చూపలేదన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును త్వరగా అమలు చేసి జవహర్‌నగర్ , దాని చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలను ఇబ్బందులను తొలగించాలని కేంద్ర పర్యావరణ శాఖకు ఎంపీ ఈటల విన్నవించారు.

ఆఖరి రోజు నామినేషన్ల జోరు

- రాత్రివరకు కొనసాగిన ప్రక్రియ
- ముగిసిన తుదివిడత నామినేషన్లు
- ఏకగ్రీవమైన రూప్‌సింగ్ తండా



బర్కత్‌పల్లి సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న అభ్యర్థి, పక్కన మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తుది విడత పంచాయితీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చివరిరోజు శుక్రవారం జోరుగా సాగింది. పరిగి నియోజకవర్గంలోని పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని ఏర్పాటు చేసిన క్లస్టర్ కేంద్రాల పరిసరాలు నాయకులు, కార్యకర్తలతో సందడిగా కనిపించింది. ఉదయం నుంచి రాత్రి వరకు నామినేషన్ల పర్వం కొనసాగింది పరిగి మండలం రంగంపల్లిలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, దోమ మండలం బొంపల్లి గ్రామంలో అదనపు కలెక్టర్ సుధీర్ పరిశీలించారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డిలు పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల మండలాల్లో పర్యటించారు. వారి పార్టీ మద్దతుగా నిలిచిన అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు తమ అనుచరగణంతో రావడంతో క్లస్టర్ల పరిసరాలు జాతరను తలపించాయి. పలుచోట్ల అభ్యర్థులు క్యూలో ఉండటంతో నామినేషన్‌ల పర్వం రాత్రి వరకు కొనసాగింది. కాగా, పరిగి మండలం రూప్‌సింగ్‌తండా సర్పంచ్‌గా రమణిబాయి ఏకగ్రీవంగా ఎంపికైంది. అయితే అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

అయ్యప్ప దుస్తులు తీయించిన అధ్యాపకులు!

నల్ల మల్లారెడ్డి కళాశాలలో ఘటన

విద్యార్థికి బలవంతంగా సివిల్ దుస్తులు వేయించిన వైనం


చందు, బీటెక్ విద్యార్థి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పోచారం పరిధిలోని నారపల్లి, దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగు కళాశాల ప్రతినిధులు అయ్యప్ప మాలతో వస్తే మాల ధారణ దుస్తులు తీసివేయించారని ఓ విద్యార్థి ఆరోపించాడు. యాదాద్రి - భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన చందు నల్లమల్లారెడ్డి ఇంజినీరింగు కళాశాలలో ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం అయ్యప్ప మాలలో కళాశాలకు వచ్చాడని అధ్యాపకులు మాల దుస్తులు తీసి కళాశాల యూనిఫాం వేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అంతటితో ఆగకుండా కళాశాలలోనే బలవంతంగా మాల దుస్తులు తీయించి యూనిఫాం వేయించారని చందు ఆరోపించాడు. ఇతరులు గడ్డాలు పెంచుకొని వచ్చినా పట్టించుకోవడం లేదు.. కానీ, హిందువులు అయ్యప్ప మాల ధరించి వస్తే కళాశాలకు రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యార్థి ఆరోపణలో వాస్తవం లేదు

ఈ ఏడాది చందు డిటెండ్ కావడంతో తల్లిదండ్రులను తీసుకురమ్మని ఆదేశించాం. అయినా అతను తీసుకురాలేదు. అయ్యప్ప మాల ధరించిన విద్యార్థులు కళాశాలకు వస్తున్నారు. చందు కావాలనే కళాశాలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడు. పోలీసులు వచ్చి విచారణ చేసి వెళ్లారు.

- రాజశేఖర్, కళాశాల ప్రతినిధి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం ఆర్కపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ బిక్కయ్యగౌడ్ ఆయన భార్య శిరీష, పలువురు పార్టీ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలుపై పంచాయతీ ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో గ్రామాలు అద్భుత ప్రగతి సాధించాయన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, మాడ్గుల మాజీ ఎంపీపీ జైపాల్ నాయక్, నాయకులు రాజవర్ధన్ రెడ్డి, జంగయ్య, జమీల్, చెన్నకేశవులు, జహంగీర్, గౌస్, యాదయ్య, వెంకటయ్య, శిరీష పాల్గొన్నారు.


మహా సభల పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మహా సభలను విజయవంతం చేయాలి

కొడంగల్ రూరల్, డిసెంబర్ 5 ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కోశాధికారి బుస్స చంద్రయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కొడంగల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, పవన్, యాసీన్, మహబూబ్, అంజి, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

రూపాయి క్షీణతను అదుపు చేయలేని కేంద్రం

కందుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూపాయి పతనంతో ప్రజల జేబులకు చిల్లు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ వాజ్‌పాయ్ (2000 సంవత్సరం) పాలనలో రూపాయి విలువ 43.35 ఉందని, అది మన్మోహన్‌సింగ్ అధికారంలోకి వచ్చాక 2004లో 45.10కి వచ్చిందన్నారు. నేడు ప్రధాని మోదీ హయాంలో నేడు రూపాయి విలువ 85.90 దగ్గర ఉందన్నారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు రూపాయి విలువ డాలర్‌కు రూ.3.30 ఉండేదన్నారు. రూపాయి విలువ ఎంత పతనమవుతున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదన్నారు. రూపాయి విలువ తగ్గడంతో విదేశాల నుంచి ఎగుమతులు చేసే వస్తువులపై అధిక భారం పడుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రూపాయి విలువ తగ్గకుండ చూడాలన్నారు.

హెచ్‌ఎండీఏకు భూములివ్వం


మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న పెద్దమంగళారం రైతులు

ఆందోళనకు దిగిన పెద్ద మంగళారం గ్రామస్తులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తమ భూములను హెచ్‌ఎండీఏకు అప్పగించడంపై నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం మండలంలోని పెద్దమంగళారం గ్రామస్తులు ధర్నాకు దిగారు. సర్వే నంబరు 218లోని భూములను ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు ఇచ్చింది. అయితే గతంలో ఇందిరమ్మ పథకంలో భాగంగా గ్రామానికి చెందిన 36 మంది పేదలకు కోళ్ల ఫారాల ఏర్పాటుకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 6.14 ఎకరాలు కొనుగోలు చేసి పట్టాలు అందజేసింది. తాజాగా ప్రభుత్వం ఈ భూములను హెచ్‌ఎండీఏకు అప్పగించడంపై బాధితు లు ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్‌ఎండీఏ ఇచ్చి న భూములను తిరిగి తమకు ఇవ్వాలని డిమాం డ్ చేస్తూ అదే భూమిలో ధర్నాకు దిగారు. ఈ మేరకు మొయినాబాద్ తహసీల్దార్ గౌతం కుమార్‌ను కలిసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ దప్పు రాజు, జంగం రాజు, పులగల సురేష్, యాదయ్య, కుమార్, గంగయ్య, కిష్టయ్య, నాగరాజు, నాగేష్, సురేష్, సామెల్, తదితరులు పాల్గొన్నారు.



సెల్ టవర్ ఎక్కి నిరసన

గతంలో ప్రభుత్వం కోళ్ల ఫారాల ఏర్పాటుకు భూమి కేటాయించి ఇప్పుడు తీసుకోవం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామానికి చెందిన ముడిమ్యాల రాములు గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు అతనికి నచ్చజెప్పి కిందకు దింపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

చకచకా..!

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పనులు



(ఐదో పేజీ తరువాయి)

పోలీసులు తీసుకుంటున్నారు. అదే విధంగా రెండు రోజుల పాటు పోలీసు సిబ్బంది, అధికారులు ఉండేందుకు శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి కొత్తూరు గేటు సమీపంలో గుడారాలు ఏర్పాటు చేశారు. తుక్కుగూడ మొదలు కొని మీర్ఖాన్‌పేట గ్లోబల్ సమ్మిట్ వేదిక వరకు రోడ్లను శుభ్రం చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు, రోడ్డు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్డుకిరువైపులా తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రకటనలతో కూడిన భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలోని ప్రధానమైన 30 శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది గత పది రోజులుగా ఏర్పాట్లను చేస్తున్నారు..

సమ్మిట్‌కు భారీ బందోబస్తు: డీజీపీ శివధర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ బి.శివధర్‌రెడ్డి తెలిపారు. సుమారు మూడు వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. శుక్రవారం ఆయన కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ ప్రదేశాన్ని పరిశీలించారు. అడిషనల్ డీజీపీలు మహేష్ భగవత్, డీఎస్ చౌహాన్, ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్ మాన్, ఐజీ రమేష్‌రెడ్డి, ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఎండీ శశాంకతోపాటు వివిధ శాఖల అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లు, బందోబస్తుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమ్మిట్‌కు హాజరయ్యే డెలిగేట్లకు 8, 9 తేదీల్లో మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. తర్వాత నాలుగు రోజులు సాధారణ ప్రజలను అనుమతిస్తామన్నారు. వీఐపీల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుందన్నారు. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా వెయ్యికిపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇవి సెంట్రల్ పోలీస్ కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉంటాయన్నారు. శనివారం సాయంత్రం వరకు అన్నిఏర్పాట్లు పూర్తవుతాయన్నారు. బందోబస్తు విషయంలో పొరపాట్లు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమిస్తున్నామన్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ కోసం ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమిస్తున్నామన్నారు. సాధారణ ప్రజలు, వాహనదారులకు ఆయా మార్గాల్లో మళ్లింపులు ఉంటాయని, ఇందుకు సహకరించాలని ఆయన అన్నారు. ఈ సమ్మిట్‌కు కావాల్సిన సదుపాయాలు బ్యారక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్ల తదితర మౌలిక వసతులపై అధికారులతో చర్చించారు. శాంతి భద్రతలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.






దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవకాశాలు కల్పించి సముచిత గౌరవం ఇవ్వాలని జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం - 2025ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. డీఆర్డీవో, జిల్లా సంక్షేమాధికారి శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఈవో ముఖ్య హాజరై వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందజేసి శాలువాతో సత్కరించారు. ప్రతిభ, నైపుణ్యమనేది శారీరక సామర్థ్యాలమీద ఆధారపడవన్నారు. సమాజ నిర్మాణంలో దివ్యాంగులు కూడా భాగస్వాములేనన్నారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, సామాజిక సురక్ష ఏ రంగంలోనైనా దవ్యాంగులు రాణించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి భారీ విరాళం

ఎమ్మెల్యేకు రూ.50 లక్షల చెక్కు అందజేసిన 'నాట్కో' ప్రతినిధులు


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు చెక్కు అందజేస్తున్న నాట్కో వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ

కొత్తూర్, డిసంబరు 5(ఆంధ్రజ్యోతి): నాట్కో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సేవలు అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ కళాశాల భవనానికి నాట్కో గ్రూప్ రూ.50 లక్షల విరాళాన్ని శుక్రవారం పరిశ్రమ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాట్కో కంపెనీ సామాజిక సేవలో భాగంగా భారీ విరాళం అందజేయం సంతోషకరమన్నారు. కంపెనీ ఉమ్మడి కొత్తూర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించిందని, అనేక గ్రామాల్లో తాగునీటి కోసం ఫిల్టర్లు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, బాబర్‌అలీఖాన్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూర్ బస్వం, సాయికృష్ణ, ఇబ్రహీం, శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, ముబారక్‌అలీఖాన్, సీతారాములు, అర్జున్, లక్ష్మణ్, మాణిక్యం, అశోక్, అనిల్, రవితేజ పాల్గొన్నారు.


సెమినార్‌లో అధ్యాపకులు, విద్యార్థులు

భవిష్యత్ అంతా ఏఐదే..


ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో భవిష్యత్ కాలం అంతా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)దేనని అనురాగ్ యూనివర్సిటీ ఈసీఈ హెచ్‌వోడీ హరికృష్ణ అన్నారు. పోచారం సర్కిల్ పరిధిలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఏఐపై సెమినార్ నిర్వహించారు. ఈ కర్యాక్రమానికి హెచ్‌వోడీ హాజరై మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ఉపయోగంపై సెమినార్‌లో చర్చించారు. ఏఐపై నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష్, రామకృష్ణ, అమృత పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి


వేంకటేశ్వరాలయం వద్ద జేడీ లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను అభివృద్ధి చేసి, ప్రజలను ఆధ్యాత్మికం వైపు మళ్లించడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. స్వామివారిని, దుర్గామాతను దర్శించుకున్నారు. లక్ష్మీ నారాయణకు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం జేడీ మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని బక్కని నర్సింహులు అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి ఆలయ ఆవరణను పార్కుగా అభివృద్ధి చేసి, చిన్నపిల్లల కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

చేవెళ్లలో నేడు రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్


ప్రదర్శనలను తిలకిస్తున్న అధికారులు

చేవెళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను నేడు (శనివారం) చేవెళ్లలో నిర్వహించనున్నట్లు తెలంగాణ మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి తెలిపారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమ ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టెమ్ ఫర్ వికసిత్ - ఆత్మనిర్భర్ భారత్ అనే థీమ్‌తో చేపట్టిన ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనశక్తి, సృజనాత్మకత, పరిశోధనాభిరుచిని పెంపొందించడమే లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 194 మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు 388 మంది పాల్గొని తమ ఆవిష్కరణలు, శాస్త్రీయ నమూనాలు, ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్, ఐఏఎస్ నవీన్ నికోలస్, కలెక్టర్ సి. నారాయణరెడ్డి హాజరు కానున్నారని చెప్పారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేకంగా భోజన వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. చేవెళ్ల ఎంఈవో పురందాస్ ఉన్నారు.

దివ్యాంగుల ప్రతిభను గుర్తించాలి


దివ్యాంగుల హస్తకళల కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ సర్కిల్, ఘనాపూర్‌లోని చైల్డ్ గైడెన్స్ సెంటర్‌లో జరిగిన దివ్యాంగుల హస్తకళల కార్యక్రమాన్ని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపక బృందం సందర్శించారు. ఈ సందర్భంగా కేపీఆర్ఐటీ డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల ప్రతిభ పాటవాలను గుర్తించాలని తెలిపారు. సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దన్నారు. స్వచ్ఛంద సంస్థలు దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని తెలిపారు. కేపీఆర్ఐటీ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనాథ్ కశ్యప్, పీఆర్వో మదన్ మోహన్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష

చేవెళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు కొనుగోలు చేసినవాటికి తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష ఆదేశించారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, ఇన్వాయిస్‌లు స్వయంగా పరిశీలించారు. అనంతరం శనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువులు, విత్తనాలు, మందులను కొనుగోలు చేసినప్పుడు తప్పక రసీదులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే వ్యాపారుపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏవో శంకర్‌లాల్, తదితరులు ఉన్నారు.

మహాత్మా.. మన్నించు..




షాద్‌నగర్‌రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ఆదరణకు నోచుకోవడం లేదు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామానికి చెందిన యువజన సంఘం సభ్యులు 15 ఏళ్ల క్రితం విగ్రహాన్ని తీసుకువచ్చి పంచాయతీ కార్యాలయం ఎదుట పెట్టారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించకపోవడంతో ఆలనా పాలనా కరువై విగ్రహం పెచ్చులూడుతోంది. ఇప్పటికైనా విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభ్యర్థులు నచ్చకపోతే నోటా



కులకచర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మూడు విడతల నామినేషన్ ప్రక్రియ ముగిసింది. గ్రామాల్లో ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ నోటాకు అవకాశం కల్పించడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. బ్యాలెట్ పేపర్‌లో చివరి గుర్తు వచ్చిన వారికి నోటా ఇబ్బందిగా మారింది. చివరి గుర్తు తనదేనని, ఓటు వేసి గెలిపించాలని గతంలో ప్రచారం నిర్వహించేవారు. ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. అందుకే అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు తన గుర్తు నంబర్ ఉన్న చోటును చూపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు నచ్చకపోతే ఓటర్లు నోటాపై ఓటు వేసే అవకాశం ఉంది.



12 హామీలతో మేనిఫెస్టో

- ఆడపిల్ల పుడితే రూ.2,500.. పెళ్లి కానుక రూ.5,501
- బాండ్ పేపర్ రాసిచ్చిన ఉడిమేశ్వరం సర్పంచ్ అభ్యర్థి

కొడంగల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అభ్యర్థులు వినూత్నంగా హామీలు ఇస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. కొడంగల్ మండలంలోని ఉడిమేశ్వరం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా మున్నూర్ శివకుమార్ పోటీ చేస్తున్నారు. రూ.100 బాండ్ పేపర్‌పై 12 హామీలతో కూడిన మెనిఫెస్టోను విడుదల చేశారు. తనను గెలిపిస్తే గ్రామంలో వాటర్ ప్లాంట్, అభివృద్ధి పనులు, ఆడ పిల్ల పుడితే రూ.2,500, పెళ్లి కానుకగా రూ.5,501, అకారణంగా మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు పంచాయతీ నిధుల ద్వారా రూ.6 వేలు, గ్రామంలో ఆరు నెలలకో సారి ఉచిత వైద్య శిబిరం ఇలా 12 హామీలతో మెనిఫోస్టోను విడుదల చేశారు. సర్పంచ్‌గా గెలిచిన తర్వాత హామీలు అమలు చేయని పక్షంలో గ్రామస్తులు తనను నిలదీయాలని బాండ్ పేపర్ ద్వారా హామీ ఇచ్చారు.



బాండ్ పేపర్‌పై సర్పంచ్ అభ్యర్థి హామీలు



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

మోమిన్‌పేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీఐ వెంకటేష్, ఎస్సై అరవింద్ పరిశీలించారు. మండలంలోని సయ్యద్ అలీపూర్, ఎన్కెపల్లి, కేసారం గ్రామాల్లో శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాల్లో సీసీ ఫుటేజీని పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పకడ్బందీ నిఘా

- సమస్యాత్మక గ్రామాల్లో అదనపు బలగాలు
- 20 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశాం
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



యాచారం,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు జరిగేలా పకడ్బందీ నిఘా ఏర్పాటు చేశామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈ నెల 17న జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పక్కా చర్యలు చేపినట్లు పేర్కొన్నారు. దీనికి రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పది మంది సిబ్బంది తోపాటు స్ట్రయికింగ్ ఫోర్స్ పరిశీలిస్తుందన్నారు. ఇప్పటికే బెల్టు షాపులను మూయించామని, అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాదీనం

డివిజన్‌లో 49 లైసెన్స్ ఆయుధాలుండగా 28 స్వాదీనం చేసుకున్నామని, మిగిలిన వాటిని స్వాదీనం చేసుకుంటామన్నారు. డివిజన్‌లో 48 మంది రౌడీషీటర్లుండగా 20 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. మొత్తం 44 సమస్యాత్మక గ్రామాల్లో అదనపు బలగాలను మోహరించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆరుగురు సీఐలు 18మంది ఎస్సైలు, 12 మంది ఏఎస్సైలు, మహిళా హెడ్ కానిస్టేబుళ్లు 40 మంది, మహిళా కానిస్టేబుళ్ల 188 మంది, స్ట్రయికింగ్ ఫోర్స్ 60 మంది మొత్తం 324 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి ఈనెల 16 నుంచి 18 వరకు డివిజన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పాత నేరస్తులపై నిఘా ఉంచామని, పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని కోరారు.

రసవత్తరంగా పల్లె పోరు

- గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- పలు చోట్ల అభ్యర్థులకు బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు
- కొన్ని చోట్ల పోటీలో మూడు ప్రధాన పార్టీలు బలపర్చిన అభ్యర్థి
- ఊరూరా జోరందుకున్న ఇంటింటి ప్రచారాలు



ఆమనగల్లు మండలం మేడిగడ్డ సర్పంచ్ అభ్యర్థి హేమిబాయి నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్లె పోరు రసవత్తరంగా మారింది. గెలుపు కోసం పార్టీలు, పంతాలు పక్కన పెట్టి ప్రధాన పార్టీల నేతలు, బరిలో నిలిచే అభ్యర్థులు పొత్తులకు సిద్ధమయ్యారు. పంచాయతీలో పైచేయి సాధించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు రాజకీయ పొత్తులకు తెరలేపారు. రాష్ట్ర రాజధానికి చేరువలో రాజకీయంగా చైతన్యం ఉన్న ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో పంచాయతీ సమరం ఢీ అంటే ఢీ అన్న చందంగా మారింది. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ఎత్తుగడలు వేస్తున్నాయి. విజయమే లక్ష్యంగా సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడడం లేదు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు కొన్ని గ్రామాల్లో సుక్క, ముక్కతో ఎర వేస్తున్నారు. కుల సంఘాల ఓట్లకు గాలం వేస్తున్నారు.



కడ్తాలలో బీఆర్ఎస్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ ప్రచార ర్యాలీలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

సర్పంచ్ స్థానాలకు 444 నామినేషన్లు

ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలో 69 సర్పంచ్ పదవులకు 444 నామినేషన్లు, 594 వార్డు స్థానాలకు 1,781 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆమనగల్లు మండలంలో 13 సర్పంచ్ పదవులకు 86 నామినేషన్లు, 112 వార్డులకు 336, తలకొండపల్లి మండలంలో 32 సర్పంచ్‌లకు 205 నామినేషన్లు, 272 వార్డులకు 742 నామినేషన్లు, కడ్తాల మండలంలో 24 సర్పంచ్‌లకు 153 నామినేషన్లు, 210 వార్డులకు 703 నామినేషన్లు దాఖలయ్యాయి.

గెలుపే లక్ష్యంగా పొత్తులు

కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో పొత్తుల రాజకీయం నడుస్తోంది. పలు పంచాయతీలలో కమలం నేతలు కారు పార్టీతో పొత్తు పెట్టుకొని పంచాయతీల్లో పోటీకి దిగారు. స్థానిక పరిస్థితులను బట్టి పొత్తులు కుదుర్చుకున్నారు. అయితే ఢీ అంటే ఢీ అనే బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటవడం విశేషం. కడ్తాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ మద్దతుతో అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్‌కు బీజేపీ నేతలు మద్దతివ్వడమే కాకుండా నామినేషన్‌తోపాటు ప్రచారంలోనూ పాల్గొంటున్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో ఇరు పార్టీలు కలిసి అభ్యర్థిని బరిలో నిలిపాయి. మంగళపల్లి ఎస్టీ మహిళకు కేటాయించగా ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీ బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి మౌనిక విజయం కోసం ఇరు పార్టీల నేతలు సర్వ శక్తులొడ్డుతున్నాయి. శెట్టిపల్లి సర్పంచ్ స్థానాన్ని ఎస్సీ మహిళకు కేటాయించగా బీజేపీ, బీఆర్ఎస్ ఉమ్మడి అభ్యర్థిగా జంగమ్మ బరిలో నిలిచింది. మేడిగడ్డ తండాలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లోని ఒక వర్గం బలపరిచిన ఉమ్మడి అభ్యర్థిగా హేమాబాయి తలపడుతోంది. కడ్తాల మండలం చరికొండలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి మహేందర్‌కు బీజేపీ మద్దతిస్తోంది. సాలార్‌పూర్‌లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంయుక్తంగా పద్మను పోటీలో నిలిపాయి. బీఆర్ఎస్‌లోని మరో వర్గం నుంచి సర్పంచ్ పదవికి ప్రియ నామినేషన్ దాఖలు చేశారు. మాడ్గుల మండలం కొల్కులపల్లిలో కాంగ్రెస్ మద్దతులో భట్టు అనురాధను పోటీలో నిలుపగా ఆమెకు పోటీగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీఆర్ఎస్‌కు చెందిన ధర్మారెడ్డిని బరిలో నిలిపాయి.

340 లీటర్ల మద్యం పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన మద్యం

శంకర్‌పల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం శంకర్‌పల్లి నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా అలంఖాన్‌గూడ గేటు వద్ద ఆటోను పోలీసులు పట్టుకున్నారు. ఆటోలోని 340 లీటర్ల మద్యాన్ని స్వాదీనం చేసుకొని ఆటోను సీజ్ చేశారు. మద్యాన్ని తరలిస్తున్న వికారాబాద్ జిల్లా పూడూరుకు చెందిన సురేష్, శేఖర్‌లపై కేసునమోదు చేసినట్లు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అలాగే మోకిల తండాలోని కిరాణా షాపులో అమ్ముతున్న తొమ్మిది లీటర్ల మద్యాన్ని మోకిల పోలీసులు పట్టుకున్నారు. యజమాని నగేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

బాలల హక్కులపై ప్రతిజ్ఞ చేయాలి

- బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర సలహాదారు జనార్దన్



తాండూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఏకగ్రీవమైన అభ్యర్థులు బాలల హక్కులను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర సలహాదారు జనార్దన్ శుక్రవారం ప్రకటనలో కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించడంతోపాటు మానవ వనరుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. ఎన్నికల్లో ప్రచారంలో పిల్లల హక్కులను కాపాడుతామని హామీ ఇవ్వాలని, బడికి రాని పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు.

గుర్తుంటేనే గెలుపు!

(ఐదో పేజీ తరువాయి)

పడుతున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని 168 సర్పంచ్ స్థానాలకు 530 మంది ఉండగా, 1,340 వార్డులకు 3,379 మంది పోటీ పడుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత వ్యక్తిగతంగా ప్రచారం చేసిన అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులు కేటాయించిన గుర్తులతో అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా కొనసాగే విషయం తెలిసిందే. అభ్యర్థులు తమ గుర్తులు ఓటర్ల మనసులో గుర్తుండి పోయేలా ప్రచారం చేస్తేనే విజయావకాశాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లిన తరువాత తాము ఓటు వేయాలనుకున్న అభ్యర్థి గుర్తు గుర్తుకు రాకపోతే ఎవరికో వేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. ఇదిలా ఉంటే, ఒకే పోలికతో పలు గుర్తులు ఓటర్లను తికమక చేసే అవకాశం ఉంది. పలక, నల్ల బోర్డు, మంచం ఒకేలాగా ఉండడంతో ఓటర్లు ఇబ్బంది పడే అవకాశం ఉంది.

సర్పంచ్, వార్డు సభ్యుల గుర్తులు ఇవే

సర్పంచ్ అభ్యర్థులకు ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీ పర్సు, టీవీ రిమోట్, టూత్‌పేస్ట్, స్పానర్, చెత్త డబ్బా, నల్లబోర్డు, బెండకాయ, కొబ్బరి తోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతి కర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మాన్, మనిషి, తెరచాపతో పడవ, బిస్కట్, వేణువు, చెయిన్, చెప్పులు, గాలి బుడగ, స్టంప్స్ గుర్తుల్లో ప్రాధాన్యతా ప్రకారం కేటాయించారు. ప్రతి బ్యాలెట్ పత్రంలో ఈ గుర్తులతో పాటు చివరగా నోటా గుర్తు కూడా ఉంటుంది. అదే వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే అభ్యర్థులకు గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటెనా, గరాటా, మూకుడు, ఐస్ క్రీమ్, గాజు గ్లాస్, పోస్టు డబ్బా, కవరు, హాకీ బంతి, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్ స్తంభం, కెటిల్ గుర్తుల్లో బరిలో ఉన్న అభ్యర్థుల పేర్ల ఆధారంగా ప్రాధాన్యతా క్రమంలో గుర్తులు కేటాయించారు. వార్డు సభ్యుల బ్యాలెట్‌లోనూ నోటా గుర్తు ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థుల్లో ఎవరూ నచ్చని ఓటర్లు నోటా గుర్తుకు ఓటు వేయనున్నారు. ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులు ప్రచారం చేసుకోవడానికి వారం రోజుల సమయం మాత్రమే ఉండేలా షెడ్యూల్ రూపొందించారు. తొలి విడత ఎన్నికల పోలింగ్ ఈనెల 11వ తేదీన జరగనుంది. ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో అభ్యర్థులు ప్రతి నిమిషం సద్వినియోగం చేసుకునేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

నోటాతో తప్పని తిప్పలు

గుర్తును గుర్తుంచుకుని ఓటు వేయాల్సి ఉండడం, బ్యాలెట్ పత్రంలో నోటాను చేర్చడం అభ్యర్థులకు కొంత ప్రతికూలంగా మారింది. ఒక్కో ఓటు కీలకమైన పల్లె ఎన్నికల్లో నోటాకు ఓట్లు పడితే గెలుపోటములను నోటా ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. 2019, జనవరి నెలలో జిల్లాలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 19 మంది సర్పంచ్, 91 మంది వార్డు స్థానాల అభ్యర్థుల విజయావకాశాలను నోటా ప్రభావితం చేయగలిగింది. పది లోపు ఓట్ల మెజార్టీతో ఓటమి చెందిన వారి కంటే అక్కడ నోటాకు ఎక్కువ ఓట్లు నమోదయ్యాయి.

పంచాయతీలకు కలెక్షన్స్

- కార్యాలయాలకు తరలివచ్చిన అభ్యర్థులు
- పన్నుల చెల్లింపుతో గ్రామాలకు పెరిగిన ఆదాయం



కులకచర్లలో నో డ్యూ సర్టిఫికెట్లు జారీ చేస్తున్న సిబ్బంది

కులకచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మూడో విడత సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లకు శుక్రవారం చివరి రోజు కావడంతో నో డ్యూ సర్టిఫికెట్ల కోసం పంచాయతీలకు అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు వెంట పడితే కూడా పన్నులు చెల్లించకుండా తప్పించుకొని తిరిగిన వారు, ఇప్పుడు వారిని వెతుక్కుంటూ వెళ్లి మరీ పన్నులు చెల్లిస్తున్నారు. కార్యాలయం వద్ద గంటల తరబడి నిలబడి బకాయిలను ఒకేసారి చెల్లిస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థుల తోపాటు వారికి ప్రతిపాదకులుగా ఉండే వారికి పంచాయతీల్లో పన్ను బకాయి ఉండకూడదన్న నిబంధన ఉండటమే ఇందుకు కారణం. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు బకాయి ఉంటే పోటీ నుంచి వైదోలగాల్సి ఉంటుంది. అందుకే వారందరూ బకాయిలు క్లియర్ చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో అభ్యర్థులే మద్దతుదారుల బకాయిలు చెల్లించారు. కులకచర్ల మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీలకు ఎన్నికల పుణ్యమా అని రూ.లక్షల్లో ఆదాయం సమకూరింది.



అమ్డాపూర్‌లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల రూట్ మార్చ్

మొయినాబాద్ రూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు కృషి చేస్తున్నట్లు మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్, శ్రీరాంనగర్ గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండాభద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ మార్చ్‌లో ఎస్ఐ నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ఉమాగౌరి, పక్కన అదనపు డీసీపీ వెంకటరమణ

సీఈఏలో వైద్య సంస్థలు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉమాగౌరి

మేడ్చల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని వైద్య సంస్థలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ అథారిటీ(సీఈఏ)లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్‌వో ఉమాగౌరి ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో ఆమె శుక్రవారం అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సంస్థలు సీఈఏ నిబంధనల ప్రకారమే నడుచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని సంస్థలు వెంటనే చేయించుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఈఏ నిబంధనలు, రికార్డుల నిర్వహణ, పరిశీలన ప్రమాణాలు, పరికరాలు, మానవ వనరులు, రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో కొంపల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు వంశీ కృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్ గీత తదితరులు పాల్గొన్నారు.

విమానయానం ... గందరగోళం

- హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఒక్కరోజే 155 ఇండిగో విమాన సర్వీసులు రద్దు
- ప్రయాణికుల ఆందోళన.. దిక్కుతోచని పరిస్థితులో కొందరు ఎయిర్‌పోర్టులోనే..
- భారీగా పెరిగిన ఇతర ఎయిర్‌లైన్స్ టికెట్ ధరలు



శంషాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణపరమైన లోపాల కారణంగా ఇండిగో విమానయాన సంస్థ ఇంకా విమాన సర్వీసులు రద్దుచేస్తూనే ఉంది. దీంతో హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఇండిగో ప్రయాణికుల పరిస్థితి దారుణంగా మారంది. ఇండిగో టిక్కెట్లు బుక్ చేసుకున్న ప్రయాణీకులు నానా ఆగచాట్లు పడుతున్నారు. శుక్రవారం ఒక్క రోజే హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే 156 విమాన సర్వీసులను ఇండిగో రద్దుచేయడంతో ఎయిర్‌పోర్టు అంతా గందరగోళంగా మారింది. . శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లాల్సిన 84 విమానాలు, వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 71 విమాన సర్వీసులను ఇండిగో సంస్థ రద్దుచేసింది. ప్రయాణీకులకు విమానాల రద్దుకు సంబంధించి సరైన సమాచారం కూడా ఇవ్వకపోవడంతో ఇక్కడకు వచ్చిన ప్రయాణీకులు నానా ఆగచాట్లుపడుతున్నారు. . దీంతో ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. వీటితోపాటు పలు అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడ రద్దయ్యాయి. ముఖ్యంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కేరళలోని కొచ్చిన్‌కు వెళ్లాల్సిన విమానాలు రద్దు కావడంతో అయ్యప్ప భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దిక్కుతోచని పరిస్థితులో కొందరు ఎయిర్‌పోర్టులోనే పడిగాపులు పడుతున్నారు. ఇండిగో విమానాలు రద్దు కావడంతో ఇతర ఎయిర్‌లైన్స్ టికెట్ ధరలు ఆకాశాన్నంటాయి. దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో ఇలాంటి పరిస్థితి ఎదుర్కొటుందని ఎవరూ ఊహించ లేదు. మున్ముందు కూడ ఇలాంటి పరిస్థితి ఉండే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఇండిగో విమానాలు రద్దు కావడంతో ఇతర విమాన టికెట్లు దాదాపు 50 శాతం పెరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండిగో సంస్థ సంక్షోభంలో ఉంటే టికెట్లు ఎందుకు ఆన్‌లైన్‌లో బుకింగ్ ఉంచారని ప్రశ్నిస్తున్నారు. టికెట్ బుక్ చేసుకొని ఎయిర్‌పోర్టుకు వచ్చిన తరువాత విమానం రద్దయిందని చెబుతున్నారు. దీంతో ఎయిర్‌లైన్స్ సిబ్బందికి, ప్రయాణికులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటుంది. వందల కిలోమీటర్ల నుంచి ఎయిర్‌పోర్టుకు వస్తే విమానం రద్దు అయ్యిందని చెప్పడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన పౌర విమానయాన శాఖ వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా అయ్యప్ప స్వాములు తెలుగు రాష్ట్రాల నుంచి వందల మంది శబరికి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమయంలో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కావున ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

ఆ కుటుంబం బాధ వర్ణాతీతం

ఇండిగో విమాన సర్వీసులు రద్దుకావడంతో ఓ కుటుంబం బాధ వర్ణాతీతంగా మారింది. విమాన ప్రయాణం రద్దుకావడంతో దివ్యాంగుని కుటుంబం హైదరాబాద్‌లో చిక్కుకుపోయింది. త్రిపురలోని ఆగర్తలకు చెందిన బిస్వంత్ దివ్యాంగుడు. తనకుమారుడైన అభిజ్ఞ(9) కంటి ఆపరేషన్ కోసం ఆయన తన భార్యతో కలిసి వీల్‌చైర్‌లో నవంబరు 27వ తేదీన హైదరాబాద్‌కు వచ్చాడు. ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో తన కుమారునికి ఆపరేషన్ చేయించి తిరుగు ప్రయాణం కోసం శుక్రవారం ఆగర్తల వెళ్లేందుకు ఇండిగోలో టిక్కెట్ బుక్ చేసుకున్నారు. గురువారం, శుక్రవారం ఉదయం కూడా ఆయన ఇండిగో ప్రతినిధులకు ఫోన్ చేసి విమాన సర్వీసుపై వాకాబు చేసారు. ఈ సర్వీసు రద్దుకాలేదని సకాలంలో ఎయిర్‌పోర్టుకు రావాలని ఇండిగో సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఆయన తన కుటుంబ సభ్యులతో శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఇండిగో సిబ్బంది అదిగో ఇదిగో అంటూ సరైన సమాచారం ఇవ్వకుండానే సాయంత్రం వరకు వారిని ఇబ్బంది పెట్టింది. ఒక వైపు కంటికి ఆపరేషన్ చేసుకున్న కుమారుడు, మరో వైపు వీల్ చైర్‌లో బిస్వంత్ ఎక్కడకు వెళ్లాలో పాలుపోని పరిస్థితిలో ఎయిర్‌పోర్టులో ఉన్నారు. సాయంత్రం సర్వీసు రద్దయినట్లు ఇండిగో సిబ్బంది చావు కబురు చల్లాగా చెప్పారు. దీంతో ఈకుటుంబం దిక్కులేక మళ్లీ నగరంలోని హోటల్‌లో ఉండేందుకు క్యాబ్ బుక్ చేసుకుని రాత్రి 7గంటలకు వెళ్లారు.

సైబరాబాద్ పోలీసులు సమీక్ష

ఇదిలా ఉంటే ఎయిర్‌పోర్టులో నెలకొన్న పరిస్థితులను సమీక్షించేందుకు సైబరాబాద్ పోలీసు అధికారులు విమానాశ్రయాన్ని సందర్శించారు. శంషాబాద్ డీసీపీ పూర్ణచందర్‌రావు, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, ఆర్జీఐఏ ఔట్ పోస్టు ఇన్‌స్పెక్టర్ సంపతి కనకయ్య ఇండిగో రీజినల్ మేనజర్‌తో సమావేశమయ్యారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

పరిగి/పూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. జాతీయస్థాయిలో జడ్చర్ల కేంద్రంలో నిర్వహించిన కరాటే పోటీల్లో గ్లోబల్ స్కూల్‌లో నాల్గో తరగతి చదువుతున్న అస్మాసాదియా ప్రథమస్థానంలో నిలిచింది. మూడో తరగతి చదువుతున్న ఆస్మీన్‌రహమత్, కంకల్ జునైరాషేక్‌లను రెండోస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల యజమాన్యం సన్మానించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అయేషా, కరాటే మాస్టర్ గౌస్‌లు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానను తరలించొద్దు

- రాంపల్లి వాసుల ఆందోళన
- వార్డు నుంచి డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్దకు మార్పుపై ఆగ్రహం
- అధికారులు స్పందించాలని డిమాండ్

కీసర రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వార్డు కార్యాలయంలోని బస్తీ దవాఖానను డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్దకు తరలించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలకు వైద్య సేవలందించేందుకు బస్తీల్లో గత ప్రభుత్వం బస్తీ దవాఖానలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా అధికారులు నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వార్డు కార్యాలయంలో ఒక బస్తీ దవాఖానను ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఇక్కడి స్థానికులు నిత్యం వచ్చి షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. వైద్యుల సలహా మేరకు అందుకు అవసరమైన మందులను ఉచితంగా పొందుతున్నారు. బస్తీ దవాఖానా ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇలాగే కొనసాగుతోంది. ఇక్కడ అందుతున్న వైద్యసేవలంతో స్థానికులు, వృద్ధులు, నిరుపేదలు సంతృప్తి చెందుతున్నారు. అయితే ఉన్నట్టుండి రాంపల్లి వార్డు కార్యాలయంలోని బస్తీ దవాఖానను రాంపల్లి రెవెన్యూ పరిధిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్దకు తరలించారు. దీంతో ఇక్కడ వైద్యసేవలు పొందుతున్న స్థానికులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. వైద్యులు లేక, షుగర్, బీపీ మందులు లభించక వృద్ధులు, నిరుపేదలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న బస్తీ దవాఖానను సుదూరంలోని మరోచోటుకు తరలించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి రవాణా సౌకర్యం లేని ప్రాంతానికి తరలించడం పట్ల వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులైన వేలాది మంది ప్రజలకు కేటాయించిన బస్తీ దవాఖానాను మరో చోటుకు తరలించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అదనంగా సౌకర్యాలు కల్పించాలే కానీ ఉన్న వాటిని తొలగించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వార్డు కార్యాలయంలోని బస్తీ దవాఖానను తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రాంపల్లి వార్డు కార్యాలయంలోని బస్తీదవాఖాన(ఫైల్)

తాండూరులో 'ఏకగ్రీవ' సంబరం

(ఐదో పేజీ తరువాయి)

వారి సమీప బంధువు మైలారం రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అతి పెద్ద గ్రామ పంచాయతీలో పోటీ చేయడానికి ప్రత్యర్థులు ఎవరూ ముందుకు రాకపోవడం చర్చనీయమైంది. కొన్ని గ్రామాల్లో ఎన్నికల వ్యయానికి భయపడి పోటీకి దూరంగా ఉండగా మరి కొన్ని చోట్ల ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రోత్సహించకపోవడంతో ఆ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థులు పోటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. కొన్ని గ్రామాల్లో పోటీ నుంచి తప్పుకున్న వారికి భవిష్యత్తులో వచ్చే ప్రాదేశిక ఎన్నికల్లో అవకాశం కల్పించేలా ఒప్పందాలు చేసుకున్నారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చారు. పెద్ద సంఖ్యలో పంచాయతీలు ఏకగ్రీవం కావడానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషి చేసినట్లు స్థానిక నేతలు చెబుతున్నారు. ధారాసింగ్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిన తర్వాత తాండూరులో ఏకగ్రీవ సర్పంచ్‌లు కావడం అటు ఎమ్మెల్యేకు ఇటు డీసీసీ అధ్యక్షుడికి పార్టీ పెద్దల వద్ద గుర్తింపు దక్కింది.

ఏకగ్రీవమైన గ్రామాలు ఇవే..

తాండూరు మండలంలో కరన్‌కోట్ సర్పంచ్‌గా రాజ్‌కుమార్, చిట్టిఘనాపూర్‌కు పటేల్ విజయ్‌కుమార్, వీరారెడ్డిపల్లికి పురుషోత్తంరెడ్డి, రాంపూర్‌కు వెంకట్‌రెడ్డి, బీజ్వార్‌కు అనూజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, బషీరాబాద్ మండలంలో బాబు నాయక్ తండాకు జే. అనిత, బాహదూర్‌పూర్‌కు నవనీత, హన్యా నాయక్ తండాకు అనిత బాయి, మంతన్‌గౌడ్‌కు భీమప్ప, నంద్యా నాయక్ తండాకు పున్నిబాయి, పెద్దేముల్ మండలం చైతన్య నగర్‌కు గౌరమ్మ, దుగ్గాపూర్‌కు మంగమ్మ, రుద్రారానికి పద్మమ్మ, సిద్ధన్నమడుగు తండాకు విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాలాల మండలంలో బండమీదిపల్లికి నరేశ్, గంగాసాగర్‌కు మల్లేశం, జెక్కేపల్లికి పెద్దింటి లాలప్ప, కిష్టాపూర్‌కు పల్లె స్వప్న, లక్ష్మీనారాయణపూర్‌కు గుర్రాల నాగమణి, పేర్కంపల్లి తండాకు శాంతిబాయి, సంగాయిగుట్ట తండాకు రమావత్ కిషన్, సంగాయిపల్లి తండాకు కమ్లిబాయి, సంగెంకుర్దు గ్రామానికి సుధలక్ష్మీ, దేవుల తండాకు మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఏకగ్రీవ సర్పంచ్‌లతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సంబురాలు

మెరుగైన సేవలందించాలి: ఎమ్మెల్యే

ఏకగ్రీవంగా ఎన్నికైన 25 మంది సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో మెరుగైన సేవలు అందించాలని కోరారు. సర్పంచ్ పదవి ఎంతో గౌరవ ప్రదమైనదని, గ్రామానికి మొదటి పౌరుడిగా విలువైన సేవలందించాలన్నారు. ఐదేళ్ల పాటు సేవ చేసేందుకు ప్రజలు అవకాశం ఇచ్చినందున వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. ఏకగ్రీవ గ్రామాలకు అవసరమైన నిధులైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాజకీయలకతీతంగా గ్రామంలో అభివృద్ధి పనులు జరగాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు బాల్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

అన్నారంలో వార్డులు ఏకగ్రీవం

కొడంగల్/దౌల్తాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం 10 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. గ్రామపెద్దల సమక్షంలో 10 వార్డుల్లో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన 10 మంది వార్డు సభ్యులకు ఎన్నికల అధికారి మధుసూదన్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు. దౌల్తాబాద్ మండలంలోని నాగాసర్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిని దాదాపూర్ అరుణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవమైన అభ్యర్థినికి ఎన్నికల అధికారులు నియామకపత్రం అందించారు. అదే విధంగా సర్పంచ్‌తో పాటు 8 వార్డుల్లో పుష్పల్‌రెడ్డి, కవిత, చాకలి అమృతమ్మ, మీదింటి దస్తప్ప, హన్మంతు, ఇంద్రమ్మ, బుజ్జిబాయి, రమేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



కొడంగల్: అన్నారంలో ఎన్నికైన వార్డు సభ్యులు

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్ప మహాపడి పూజలో పడివెలిగిస్తున్న గురుస్వామి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోచారం సర్కిల్, వెంకటాపూర్‌లో ఉదారి వెంకటేష్ ముదిరాజ్ నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కనుల పండువగా జరిగింది. బర్ల ఆంజనేయులు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజలో అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణతో వెంకటాపూర్ మార్మోగింది. అయ్యప్ప మాలధారులు నృత్యాలు చేసి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. స్వామివారి 18మెట్ల పడి వెలిగించడంతో హారతి సమర్పించారు. అనంతరం మాలధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్పమాలధారులు, కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చింతపంటి సత్తయ్యయాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

పెద్దేముల్: మండలంలోని జనగాం గ్రామంలో శుక్రవారం కన్నిస్వామి దోరేల్ల మధుసూదన్‌రెడ్డి అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి పల్లకీసేవ నిర్వహించారు. గ్రామంలోని పాండురంగ స్వామి దేవాలయం వరకు అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు అయ్యప్ప నామస్మరణ, శరణుఘోషలు పలుకుతూ స్వామి వారి పల్లకీసేవ జరిపారు. అనంతరం గుట్టపైన జరిగిన పూజకు భక్తులు కూడా పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

కులకచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని, ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కులకచర్ల, చాపలగూడెం గ్రామాల్లో పర్యటించి పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారని, ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, సారా శ్రీనివాస్, బాల్‌రాజ్, కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో నవోదయ మోడల్ పరీక్ష

తాండూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గ విద్యార్థులు నవోదయ పరీక్ష రాయబోతున్న సందర్భంగా తాండూరు శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రేపు(ఆదివారం) మోడల్ పరీక్ష నిర్వహించబోతున్నట్లు రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు బాలకృష్ణ, నిర్వాహకులు కృష్ణయ్య తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు మోడల్ పరీక్ష ఉంటుందన్నారు. నవోదయ పరీక్షను ఇంగ్లీష్, తెలుగు మీడియంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్ష కోసం ఈనెల 6వ తేదీ రాత్రి 8 గంటల వరకు పేరు నమోదు చేసుకోని భాష్యం జూనియర్ కళాశాలలో మోడల్ పరీక్ష హాల్ టికెట్ పొందాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తాండూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం జిన్‌గుర్తి గ్రామ శివారులోని మైనార్టీ బాలుర పాఠశాలలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎవరైన సైబర్‌నేరాల బారినపడితే వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. విద్యార్థులను 'సైబర్ ఫ్రాడ్‌కా ఫుల్‌స్టాప్' అనే కార్యక్రమం ద్వారా చైతన్య పరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్, బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటాపోటీగా నామినేషన్లు



దోమ: అయినాపూర్‌లో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందిస్తున్న గోవర్ధన్



చౌడాపూర్: విఠలాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న చెన్నయ్య



దోమ: నామినేషన్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

దోమ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 36 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చివరి రోజు శుక్రవారం అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. మండలంలోని 36 గ్రామ పంచాయతీలు, 308 వార్డులకు అభ్యర్థులు తమ నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారులకు అందించారు. ఈ నెల 6వ తేదీన నామినేషన్ల పరిశీలన, 9న విత్‌డ్రా, అదే రోజు గుర్తులను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, మేకల యాదయ్య, మాజీ సర్పంచ్‌లు మల్లేశ్, మున్నయ్య, అంజిలయ్య, దశరథ్, సుభాన్, సాయన్న పాల్గొన్నారు.

చౌడాపూర్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు శుక్రవారం పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. చివరిరోజు కావడంతో రాత్రి వరకు అభ్యర్థులు వేచి ఉంటూ తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. మండలంలోని విఠలాపూర్ నామినేషన్ కేంద్రంలో సర్పంచ్, వార్డులకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

పూడూరు: మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం ముగిసింది. 32 పంచాయతీలు, 288 వార్డులకు నామినేషన్ల దాఖలు ప్రారంభమైన మూడు రోజుల్లో నామినేషన్ల పర్వం జోరుగా సాగింది. ఇందులో చివరిరోజు వరకు 32 పంచాయతీలకు గాను 213, 288 వార్డులకు 803 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో పాండు తెలిపారు. కొత్తపల్లి పంచాయతీకి కేవలం ఒకేఒక్క నామినేషన్ దాఖలైంది. దీపిక రెడ్డి అనే మహిళ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

దోమ: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన కేంద్రాలను అదనపు కలెక్టర్ సుధీర్ శుక్రవారం పరిశీలించారు. బొంపల్లిలో నామినేషన్ కేంద్రంలో అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చివరిరోజు కావడంతో 5గంటల్లోపు కేంద్రంలోకి వచ్చిన వారి నామినేషన్లను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గ్యామానాయక్, డిప్యూటీ తహసీల్దార్ నర్సిములు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: ఎన్నికల నామినేషన్ ప్రక్రియ చివరి రోజు శుక్రవారం ఎంపీడీవో రామకృష్ణ మండలంలోని కామునిపల్లి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. మూడు రోజులుగా వేసిన నామినేషన్లను గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. నామినేషన్‌లో పొరపాటు జరగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నామినేషన్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.



కులకచర్ల: కామునిపల్లి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



కుసుమ సముద్రంలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థితో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

యాలాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నసాగర్ గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరపున ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. అదేవిధంగా జుంటుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి మద్దతుగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ముందుగా జుంటుపల్లి సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సంగెంఖుర్దు హన్మంతు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కులకచర్ల: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని పరిగి ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని కుసుమసముద్రం, పుట్టపహాడ్, కులకచర్ల గ్రామాల్లో శుక్రవారం పర్యటించి అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ధారూరు: మండలంలోని గడ్డమీదిగంగారం, దోర్నాల గ్రామాలలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీకి చెందిన పలువురు నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ధారూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.రవీందర్, మాజీ సర్పంచ్ శంకరప్ప, గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదప్ప తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: గడ్డమీది గంగారంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

అఖిలరెడ్డి కుటుంబానికి హాస్టల్ ఫీజును తిరిగి ఇచ్చిన యజమాన్యం



మొక్కలు నాటుతున్న కళాశాల యజమాన్యం

తాండూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గచ్చిబౌలిలోని ఐబీఆర్ఎం ఎంబీఏ కళాశాల విద్యార్థిని అఖిలరెడ్డి మృతిచెందిన విషయం విధితమే. కాగా కళాశాల యజమాన్యం అఖిల చెల్లించిన హాస్టల్ ఫీజును పెద్ద మనస్సుతో వారి కుటుంబసభ్యులకు తిరిగి చెల్లించారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో యజమాన్యం, విద్యార్థులు కుటుంబ సభ్యుల ద్వారా అఖిల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కళాశాల ఆవరణలో పూల మొక్కలు, పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



ఎన్కతలలో దగ్ధమైన ఇల్లు

మోమిన్‌పేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన ఘటన మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బ్యాగరి లక్ష్మయ్య ఇంట్లో శుక్రవారం మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో బీరువాలోని దుస్తులు, నిత్యావసర సరుకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు ఆర్థిక సఆయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. ఈ ఘటనపై ఆర్ఐ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి నర్సిములు పంచనామా నిర్వహించి తహసీల్దార్‌కు అందజేశారు. ప్రభుత్వం తరపున ఆర్థికసాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



చిందర వందరగా పడవేసిన సామగ్రి

కొడంగల్ రూరల్, డిసెంబరు 5 ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ బస్‌డ్రైవర్ కిరణ్‌కుమార్ ఠాకుర్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. కిరణ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఈనెల 2వ తేదీన హైదరాబాద్ వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడిఉండడంతో బీరువాలు తెరిచి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా పగులగొట్టి అందులోని 3 తులాల బంగారం, 20 తులాల వెండి, నగదు ఎత్తుకెళ్లారని తెలిపారు. సమాచారం అందుకున్న కొడంగల్ ఎస్ఐ-2 సత్యనారాయణ రాజు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కిరణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొంగతనానికి పాల్పడిన ముగ్గురు మైనర్లపై కేసు

- బుల్లెట్ బైక్, నగదు స్వాధీనం

పరిగి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరిగి మార్కెట్‌లో నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని బెదిరించి దొంగతానికి పాల్పడిన ముగ్గురు మైనర్ బాలురను పరిగి పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఇందుకు సంబంధించి సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. దోమ మండలం బ్రాహ్మణ్‌పల్లితండాకు చెందిన నేనావత్ గోపాల్ ముంబై వెళ్లేందుకు గురువారం రాత్రి పరిగికి వచ్చాడు. గురువారం రాత్రి ఆలస్యం కావడంతో మార్కెట్‌యార్డులో పడుకొని శుక్రవారం ఉదయం వికారాబాద్‌కు వెళ్లవచ్చని అనుకుని మార్కెట్‌యార్డులో ఉండగా తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో బుల్లెట్ బైక్‌పై ముగ్గురు మైనర్లు వచ్చారు. ఒంటరిగా ఉన్న గోపాల్ దగ్గరకు వెళ్లి అతన్ని కొట్టి, బెదిరించి సెల్‌ఫోన్, బ్రాస్‌లేట్, కొంత నగదును తీసుకుని పారిపోయారు. దీంతో బాధితుడు పరిగిలో నివాసముంటున్న తమ పిన్ని దగ్గరకు వెళ్లి 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మార్కెట్‌లో అనుమానంగా తిరుగుతున్న ముగ్గురి మైనర్లను పట్టుకుని విచారణ చేపట్టగా నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. వారి నుంచి బైక్‌తో పాటు స్టీల్ బ్రాస్‌లేట్, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. అనంతరం వారిని జువేనల్ హోంకు తరలించారు.

సోషల్ మీడియాలో వేధింపులు..

- పోలీసులను ఆశ్రయించిన యువతి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వేధింపులకు గురి చేస్తున్నారని ఓ యువతి పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధి కొర్రెములకు చెందిన ఓ యువతి(30)ని ప్రమోద్ కుమార్ అనే వ్యక్తి తనపై తప్పుడు ఆరోపణలు చూస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

యాలాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో కార్మికులు. నాయకులతో కలిసి శుక్రవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 7, 8, 9వ తేదీల్లో మూడు రోజులపాటు సీఐటీయూ రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. మొదటి రోజు మెదక్ జిల్లాలోని మార్కెట్ యార్డు నుంచి కార్మిక ప్రదర్శన, రెండు రోజుల పాటు కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈసభకు ముఖ్యఅతిథిగా ఉమ్మడి సీఐటీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి బీవీ.రాఘవులు, అఖిలభారత అధ్యక్షుడు కె.హేమలత, కోశాధికారి ఎం.సాయిబాబా హాజరవుతారని అన్నారు. ఈ సభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వెంకటయ్య, కార్మికులు, ఆరీఫ్, రాములు, ఆనందం, సరస్వతి, ఈశ్వరమ్మ, శ్యామమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలు రద్దు చేయాలి

వికారాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలను వెంటనే రద్దు చేయాలని ఆ సంఘం జిల్లా మాజీ అసోసియేట్ అధ్యక్షుడు జొన్నల బస్వరాజ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. కొందరు స్వార్థపరుల నిర్ణయం కారణంగా ఆరు మండలాల కార్యవర్గ సభ్యులు ఈ ఎన్నికలను బహిష్కరించినా జిల్లా శాఖ ఎన్నికలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా శాఖ ఎన్నికలు నిర్వహించారన్నారు. ఈ ఎన్నికలను బహిష్కరించిన తాండూరు, యాలాల్, బషీరాబాద్, మోమిన్‌పేట్, మర్పల్లి మండలాల నుంచి ప్రాతినిధ్యం లేదని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యయుతంగా జరగని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో భజనలు నిర్వహిస్తున్న భక్తులు

కొడంగల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సభ్యులు భజనలు నిర్వహించారు. ప్రతీరోజు కొంత సమయాన్ని ఆధ్యాత్మిక చింతనకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని సభ్యులు పేర్కొన్నారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు నిర్వహించారు. పూజల్లో భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.